

# ఆత్మను తాకడమే..

**మలైకా** అరోరా.. స్టన్నింగ్ లుక్స్, డ్రెస్సింగ్ స్టయిల్, రిలేషన్‌షిప్ ఇలా ప్రతి విషయంలోనూ సెన్సేషన్‌కు కేరాఫ్‌గా కనిపిస్తుంది. ఈ బాలీవుడ్ హాట్ బ్యూటీ.. కొన్నిరోజులుగా నిత్యం వార్తల్లోనే నిలుస్తున్నది. ఆమె గురించి నెట్టింట నిత్యం ఏదో ఒక చర్చ జరుగుతూనే ఉంటుంది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో.. ఓ ఇంట్రెస్టింగ్ టాపిక్ గురించి పోస్ట్ పెట్టింది మలైకా. 'మీలో కలిగే ప్రతి సానుకూల ఆలోచన.. ఓ నిశ్శబ్ద ప్రార్థనే! అది మీ జీవితాన్ని మార్చేయగలదు. శుభోదయం!'.. అంటూ రాసుకొచ్చింది. మరో స్టోరీలో.. 'మీ హృదయాన్ని ఒక్క క్షణంపాటు తాకడమంటే.. ఒక ఆత్మను జీవితకాలంపాటు స్పృశించడమే..' అంటూ ఓ సందేశాత్మక పోస్ట్‌ను అభిమానులతో పంచుకున్నది. అంతకుముందే.. తన సినిమా ప్రమోషన్లలో భాగంగా, తాను నిజంగానే ఒంటరిగా ఉన్నానని చెప్పుకొచ్చాడు అర్జున్ కపూర్. మలైకాతో తాను విడిపోయినట్లు చెప్పకనే చెప్పాడు. ఈ మాటలను ఉద్దేశించే.. మలైకా ఈ పోస్ట్ పెట్టిందని బీటౌన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. బాలీవుడ్‌లో ఐటమ్ సాంగ్స్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మలైకా.. సల్మాన్‌ఖాన్ సోదరుడు అర్బాజ్ ఖాన్‌ను 1998లో పెళ్లి చేసుకున్నది. వ్యక్తిగత కారణాల వల్ల 2017లో విడాకులు తీసుకున్నది. ఏడాది లోపే తనకంటే వయసులో చాలా చిన్నవాడైన అర్జున్ కపూర్‌తో డేటింగ్ మొదలుపెట్టింది. తాజాగా.. వీరిద్దరూ విడిపోయారంటూ సోషల్ మీడియాలో రచ్చ సాగుతున్నది.

# సమానంగా చూడాలి..

**నిన్నటితరం** గ్లామర్ క్వీన్.. మాధురీ దీక్షిత్! వయసుతోపాటే ఆమె అందం కూడా పెరుగుతున్నది. 57 ఏళ్లలోనూ నవ నాయికలకు తీసిపోని గ్లామర్‌తో ఆకట్టుకుంటున్నది. చాలారోజుల తర్వాత.. అనీస్ బాజ్మీ దర్శకత్వంలో వచ్చిన 'భూల్ భూలయ్యా 3'లో కనిపించింది. ఈ చిత్ర ప్రమోషన్లలో భాగంగా.. ఇటీవల పలు చానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన పెళ్లి జరిగిన తీరు, వివాహ బంధం గురించి కొన్ని విషయాలు చర్చించింది. తన సోదరుడు అజిత్ దీక్షిత్ పట్టుబట్టడంతో అమెరికాలో కార్డియోవాస్కులర్ సర్జన్‌గా పనిచేస్తున్న శ్రీరామ్‌ని కలిసిందట మాధురి. కొన్నాళ్లకు వారి స్నేహం ప్రేమగా మారడంతో.. 1999లో వీరిద్దరూ పెళ్లి పీటలెక్కారట. ఆ సమయంలో స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతున్న మాధురి.. తన వివాహ వేడుకను అమెరికాలోనే జరుపుకొన్నట్లు చెప్పుకొచ్చింది. 'వివాహ బంధం ఎంతో గొప్పది. ఇది అనేక అనుభవాల కలబోత. పెళ్లి అనే ఒక్క మాటలో.. ఎన్నో విషయాలు దాగి ఉంటాయి. అందులో పాజిటివ్‌లు, నెగెటివ్‌లు ఉంటాయి. ఈ రెండిటినీ భార్యాభర్తలిద్దరూ సమానంగా చూడాలి' అంటూ పెళ్లి గురించి తన అభిప్రాయాలను వెల్లడించింది.



నమస్తే తెలంగాణ
# జిందగీ
హైదరాబాద్ | ఆదివారం 17 నవంబర్ 2024 www.ntnews.com



సినిమా అంటే.. పెద్ద కాస్టింగ్!
సినిమా అంటే.. భారీ సెట్స్!
సినిమా అంటే.. నాలుగు పాటలు.. మూడు ఫైట్లు..
అదరగొట్టే పంచ్ డైలాగ్‌లు!! ఇవేం లేకుండా సినిమాను
ఊహించలేమా? మరైతే, ఈ 'సత్యం.. సుదరం'
ఎవరు?'బావోయ్!!' అంటూ కలుపుగోలుగా
మాట్లాడుతూ ఒకరు..'చెప్పు' అని మొహమాటంగా
మాట్లాడుతూ మరొకరు.. జస్ట్ ఇద్దరే!! ఎలాంటి
ఆర్భాటాలూ లేవు.. పాటల్లేవ్.. ఫైట్లు అస్సల్లేవ్..
పేజీల కొద్దీ డైలాగులూ లేవు! ఓన్లీ ఇద్దరే..
ఒకరితో ఒకరు మాట్లాడుకున్నారు!!
అంతే.. !! సినిమా అయిపోయింది.. !!
సూపర్ హిట్ అయిపోయింది!!
ఇప్పుడెందుకు దాని గురించి అంటారా?
ఓటీటీతో సత్యం.. సుందరం ఇంటింటికీ వెళ్లారు!! ఈ
బావాబామ్మర్దులను.. ఇంటిల్లిపాదీ కూర్చుని చూస్తున్నారు!!

# ఆ పాత్రలు మన జ్ఞాపకాల్లో..

**రొడ్డ కొట్టుడు** సినిమాలకు అలవాటు పడిన మన ప్రేక్షకులు సాదాసీదా సినిమాలు చూస్తారా? అన్న ప్రశ్నకు.. 'సత్యం.. సుందరం' సమాధానమిచ్చింది. ఆ చిత్రాన్ని అందరూ చూశారు. చాలా శ్రద్ధగా చూశారు. సైలెంట్‌గా థియేటర్ల నుంచి బయటికొస్తూ ఏదో ఆలోచనలో పడ్డట్టున్నారు? ఎందుకంటే.. ఆ చిత్రంలో వాళ్లిద్దరు మాత్రమే మాట్లాడుకోలేదు!! థియేటర్‌కి వచ్చిన ప్రతి ప్రేక్షకుడితో మాట్లాడారు!! అడక్కుండానే కొన్ని ప్రశ్నలు వేశారు!

**ఇలా** సినిమాలో క్యారెక్టర్లు ప్రేక్షకులతో మాట్లాడటం చాలా అరుదు!! ఎప్పుడో ఒకసారి.. ఇలాంటి ప్రయత్నం జరుగుతుంటుంది. 'అంబే శివం' పేరుతో కమల్, మాధవన్ 20 ఏళ్ల క్రితమే ఈ తరహా ప్రయోగం చేశారు. ఈ తమిళ చిత్రం తెలుగులో 'సత్యమే శివం'గా విడుదలైంది. ఇదీ ఆ కోవకు చెందిన సినిమానే! మన తనికెళ్ల భరణి తీసిన 'మిథునం' మరో అద్భుతం. రెండంటే.. రెండు పాత్రలతోనే.. జీవిత సారాన్ని పరిచయం చేశారు. కృష్ణవంశీ 'రంగమార్తాండ'లో ఎన్నో క్యారెక్టర్లు ఉండొచ్చు! కానీ, ప్రకాశ్‌రాజ్, బ్రహ్మానందం పాత్రలు అలా గుర్తుండిపోయాయి. ఈ తరహా సినిమాలు పేరుతో కన్నా.. పాత్రలతోనే ఎక్కువగా గుర్తుండిపోతాయి. ఎందుకంటే.. ఆ రెండు పాత్రల మధ్య మాటలు, వాటి తాలూకు ఎమోషన్స్ ప్రేక్షకులను మాయలో పడేస్తాయి. అప్పుడు వెండితెర అద్దంలా మారిపోతుంది. ఆ పాత్రలు మన జీవితాలను ప్రతిబింబిస్తాయి. ఎవరికి వారు బ్లర్‌గా కనిపిస్తారు. ఎందుకంటే.. అప్పటికే చెమర్చిన కళ్లకు దృశ్యం అస్పష్టంగానే గోచరిస్తుంది కదా!!

**సినిమాకు** ప్రత్యేకించి కొలమానాలు ఏం లేవు. వెండితెరపై ఎన్నో కథలు అలరిస్తాయి. వాటిలో కొన్ని కల్పితం.. కొన్ని వాస్తవ సంఘటనల సమ్మిళితం.. ఇంకొన్ని ఊహాతీతం.. ఇలా రకరకాలు. కథ ఏదైనా.. దాన్ని ముందుకు నడిపించేది పాత్రలే! చాలా పాత్రలు చాలా కాస్ట్‌లీగా అనిపిస్తాయి. కొన్నే సాదాసీదాగా కనిపించి.. విశేషంగా అలరిస్తాయి. ఇలా కామన్‌మ్యాన్‌తో కలిసిపోయే పాత్రలు ప్రేక్షకుడి మదిలో ఓ ముద్ర వేస్తాయి. తరాలు మారినా ఇది నిజం! లేదంటే.. మిలీనియల్స్ యుగం దాటి.. జెన్ జీలోకి వచ్చేశాం. అయినా.. మనలో ఇంకా 'సత్యం.. సుందరం' అలానే ఉన్నారు. అందుకే కాబోలు.. అంతే ఎమోషనల్‌గా ఆ తరహా పాత్రలకు దగ్గరవుతున్నాం. వారు చెప్పింది వింటున్నాం. అలా కాకపోతే.. సుందరం 'బావోయ్' అన్న పిలిస్తే మనమెందుకు ఎమోషన్ అయ్యాం? సినిమా చివర్లో సత్యం 'రేయ్.. పొటాటో' అంటూ సుందరం కోసం ఆత్రంగా ఊరొస్తే ఎందుకు ఆనందపడిపోయాం? నేటి యాంత్రిక జీవితంలోకి అనుకోని అతిథుల్లా వచ్చిన 'సత్యం.. సుందరం' మనల్ని మనకు పరిచయం చేశారు. వెండితెరకు గౌరవం తెచ్చిపెట్టారు.

## పెద్ద హీరోలు ముందుకు రావాలి

తన సెకండ్ ఇన్నింగ్స్‌లో తారస్థాయిలో ఉన్న అరవింద స్వామి, వరుస విజయాలతో బిజీగా ఉన్న కార్తిక్.. 'సత్యం.. సుందరం'గా కనిపించారంటే ఆ పాత్రలకు వారిచ్చిన ప్రాధాన్యం అలాంటిది. సూర్య, జ్యోతిక కలిసి సినిమాని ప్రొడ్యూస్ చేయడం విషయం. తమిళంలో '96' లాంటి సెన్సేషనల్ లవ్‌స్టోరీ తీసిన సి.ప్రేమ్‌కుమార్ ఈ సినిమాకు దర్శకుడు. '96'లోనూ రెండు పాత్రలతో కథను పెనవేసి, ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టాడు ఆయన. మరో విషయం ఏంటంటే.. సున్నితమైన ఎమోషన్స్ చూపిస్తూ.. ఆయా పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేసి మెప్పించడం మామూలు విషయం కాదు. పెళ్లి మంటపంలో సత్యం తన మరదలితో మాట్లాడే సీన్ ఎంత చక్కగా ఉంటుందో! తన బాధలు చెప్పుకొన్న మరదలిని చూడటం.. వెళ్తూ వెళ్తూ ఆమె సత్యాన్ని లీలగా తాకడం.. అక్కడ ఆయనిచ్చే ఎక్స్‌ప్రెషన్.. అరవిందస్వామి నటనానుభవానికి మెచ్చు తునక. ఇక సుందరంగా కార్తిక్ హావభావాలతో బావపై ప్రేమ.. తను దాటొచ్చిన కష్టాల్ని చెబుతుంటే.. స్వచ్ఛమైన జీవితాన్ని గడపడానికి చాలా ధైర్యం కావాలని అనిపిస్తుంది. అలాంటి బంధువో.. బాల్య మిత్రుడో ఉంటే చాలనిపిస్తుంది.

## అచ్చతెలుగు 'మిథునం'

60 ఏండ్ల వైవాహిక జీవితాన్ని అందంగా అందించిన కథ 'మిథునం'. కేవలం రెండు పాత్రలతోనే చేసిన అసలు సిసలైన ప్రయోగం. కథకుడు రమణ రాసిన కథకు.. భరణి తీసిన మాయాజాలం ఈ సినిమా. 'పిల్లలు ఖండాలు దాటేసినా.. మనకేం కాదు.. నాకు నువ్వు.. నీకు నేను..' అనుకుంటూ మలి వయసులో పసి జంటలా అప్పదాసుగా బాలూ, బుచ్చిగా లక్ష్మి పండించిన నటనను ఎలా మర్చిపోతాం. వారి సంభాషణల్లో.. హావభావాల్లో.. చిక్కని సందేశం వినిపిస్తుంది. అందుకే 'ఆది దంపతులు అభిమానించే అచ్చ తెలుగు మిథునాన్ని..' ప్రేక్షకులందరూ అభిమానించారు.

> **20 ఏళ్ల కిందట..**
>
> **సమాజంలో** ఇలాగే బతకాలి.. అదే లైఫ్ అంటూ.. గిరి గీసుకుని లైఫ్‌ని లీడ్ చేసేవాళ్ల.. అంతా దేవుడే చూసుకుంటాడనే మనిషి నమ్మకాల్ని ప్రశ్నిస్తూ వచ్చిన సినిమా 'సత్యమే శివం'. కథ కమల్ హాసన్ అయితే, దర్శకుడు సుందర్.సి, మాధవన్ మాటలు అందించాడు. అనుకోని రీతిలో ఇద్దరు వ్యక్తులు కలవడం.. తర్వాత వారిద్దరి ప్రయాణం, చోటుచేసుకునే సంఘటలను, వాదోపవాదాలు.. ప్రేక్షకులకు ఎన్నో ప్రశ్నలు వేస్తాయి. 'దేవుడు ఎక్కడో లేడు.. మనలోనే మనిషి రూపంలో ఉంటాడు. అప్పుడే మనిషికి మనిషే సాయపడతాడ'ని చాలా సున్నితంగా చెప్పే ప్రయత్నం చేస్తుంది ఈ సినిమా. ఈ చిత్రం విడుదలై ఇన్నేళ్లు అవుతున్నా.. కమల్, మాధవన్ పాత్రలు ఎప్పటికీ గుర్తుండిపోతాయ్.

**ఈ** మధ్యే మెప్పించిన 'రంగమార్తాండ' మరో మంచి సినిమా. ఇద్దరు స్నేహితులు. రాఘవరావు, చక్రపాణి. విశ్రాంత జీవితాన్ని గడుపుతున్న కన్నవాళ్లని ఎలా చూసుకోవాలో, వాళ్లతో ఎలా మెలగాలో చెప్పే పిల్లల కథ. మొత్తంగా నేటి జీవితాల్ని ప్రతిబింబిస్తూ మనసుల్ని తడిచేసే ఓ హృద్యమైన కథ. నాటకరంగానికి చెందిన ఇద్దరు స్నేహితుల జీవితాల్లో ఎదురైన సంఘటనలు, సంభాషణలు.. వారి నిష్క్రమణ మర్చిపోగలమా? 'అలసిపోయానురా.. ముక్తిని ప్రసాదిస్తావా? ' అంటూ చక్రపాణి ఆడిగిన వైనం నిద్రలో కూడా వెంటాడుతుంది. కేవలం కథలోని పాత్రలే అవి.. కానీ, వెంటాడతాయ్. మనతో పాటు ఇంటికీ వచ్చేస్తాయ్. మర్చిపోలేని ఓ అతిథిగా మన జ్ఞాపకాల్లో నిక్షిప్తమవుతాయి!! పాన్ ఇండియా మూవీలు.. పెద్ద బడ్జెట్ సినిమాలు అంటూ ఓ చట్రంలో ఇరుక్కుపోకుండా మన పెద్ద హీరోలు కూడా ఈ తరహా సినిమాలకు పచ్చజెండా ఊపాలి. పెద్ద సినిమాల మధ్యలో ఓ చిన్న ఆటవిడుపులా కూడా ఈ తరహా పాత్రల్లో కనిపిస్తే కెరీర్‌కు కిక్ ఉంటుంది.

... రాజేశ్ యడ్ల

# ట్విస్టుల హనీ బన్నీ

ఓటీటీ హిట్

**సిటడెల్:** హనీ-బన్నీ
**అమెజాన్ ప్రైమ్:** నవంబర్ 7
**తారాగణం:** సమంత, వరుణ్ ధావన్, కేకే మీనన్, సికందర్ ఖేర్, షకీబ్ సలీమ్ తదితరులు
**దర్శకత్వం:** రాజ్ అండ్ డీకే

**టాలీవుడ్** నుంచి హాలీవుడ్ దాకా.. 'స్పై' చిత్రాలకు ఉండే క్రేజేవేరు. అబ్బురపరిచే చేజింగులు.. ఫైరింగులతో సగటు ప్రేక్షకుడు ఫీలయ్యే కిక్కే వేరు. ఊహించని ట్విస్టులు, అదిరిపోయే టర్నింగులు.. సినిమా చూస్తున్నంతసేపూ మనల్ని మునివేళ్లపై నిలబెడతాయి. అందుకే, 'గూఢచారి' చిత్రాలెప్పుడూ.. బాక్సాఫీస్‌ను కొల్లగొడుతూనే ఉన్నాయి. ఆ ఫార్ములాతో వచ్చే వెబ్‌సిరీస్ కూడా 'హిట్' టాక్ తెచ్చుకున్నాయి. స్టార్ దర్శక ద్వయం రాజ్-డీకే కూడా ఇదేబాటలో నడుస్తున్నారు. ఇప్పటికే ఫ్యామిలీమ్యాన్, ఫర్జీ, గన్స్ అండ్ గులాబ్స్‌తో సక్సెస్ సాధించారు. ఇప్పుడు 'సిటడెల్ : హనీ-బన్నీ'నీ అమెజాన్ ప్రైమ్ వేదికగా రంగంలోకి దింపారు.





కథలోకి వెళ్తే.. నైనిటాల్‌లోని ఓ కెఫేలో పని చేస్తుంటుంది హనీ (సమంత). ఆమెకు నాడియా (కశ్వీ మజ్ముందార్) అనే ఐదేళ్ల కూతురు ఉంటుంది. ఒకరోజు తమను ఎవరో వెంబడిస్తున్నట్టు గుర్తిస్తుంది హనీ. వారినుంచి తప్పించుకునే క్రమంలో దొరికిపోతుంది. చివరికి వారి చెర నుంచి బయటపడి.. కుమార్తెతో సహా వేరే ఊరికి వెళ్లిపోతుంది. కానీ, కొందరు వ్యక్తులు హనీ ఉన్న ప్రదేశం తెలుసుకుని.. అక్కడికీ వస్తారు. మరోవైపు, విదేశాల్లో ఉంటున్న బన్నీ (వరుణ్ ధావన్)కి.. చనిపోయిందనుకున్న తన భార్య హనీ బతికే ఉందన్న విషయం తెలుస్తుంది. దాంతో ఆమెను వెతుక్కుంటూ భారత్‌కు వస్తాడు. అయితే.. హనీ-బన్నీ గతం ఏంటి? హనీ వెంటపడుతున్న వ్యక్తులు ఎవరు? ఎంతటి వారితోనైనా పోరాడే సామర్థ్యం హనీకి ఎలా వచ్చింది? భార్యను వెతుక్కుంటూ వచ్చిన బన్నీకి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? ప్రైవేటు సీక్రెట్ ఏజెన్సీ నాయకుడు గురు (కేకే మేనన్) ఒకవైపు, 'సిటడెల్' టీమ్ మరోవైపు వెతుకుతున్న 'అర్మార్డ్' ఏమిటి? అది ఎవరి చేతికి చిక్కింది? ఈ విషయాలు తెలుసుకోవాలంటే.. 'సిటడెల్ : హనీ - బన్నీ' చూడాల్సిందే! ఆరు ఎపిసోడ్ల ఈ సిరిస్ ఆసక్తికరమైన మలుపులతో ప్రేక్షకులను ఎంగేజ్ చేస్తుంది.

# ఒక్క ఫోన్.. జంట ప్రొఫైల్స్!

హాట్ అప్‌డేట్

**మనలో** చాలామంది ఇంటి పనిని, ఆఫీస్ వర్క్‌ని వేర్వేరుగా చూస్తాం. అందుకే కొందరు రెండు ఫోన్ నెంబర్లు వాడుతుంటారు. ఒకటి ఆఫీస్ పర్పస్‌కైతే, ఇంకోటి వ్యక్తిగత అవసరాలకు! ఇదే మాదిరిగా మీరు వాడే ఒకే ఆండ్రాయిడ్ ఫోన్‌ను.. రెండు విభాగాలుగా విభజించొచ్చు. దాన్నే ఇప్పుడు టెక్నికల్‌గా 'ఆండ్రాయిడ్ వర్క్ ప్రొఫైల్' అని పిలుస్తున్నారు. ఈ సెట్టింగ్స్‌ని ఎవరికి వారే సెట్ చేసుకుని వర్క్ బ్యాలెన్స్‌ని పాటించొచ్చు. అలాగే, కంపెనీలు కూడా ప్రత్యేకంగా ఈ సెట్టింగ్స్‌ని అప్లై చేయొచ్చు. ఉదాహరణకు కంపెనీ ఆఫీస్ అవసరాల నిమిత్తం మీకో ఫోన్ ఇస్తే... దాంట్లో 'వర్క్ ప్రొఫైల్, పర్సనల్ ప్రొఫైల్' రెండిటినీ కంపెనీయే క్రియేట్ చేస్తుంది. ఈ క్రమంలో మొబైల్ మొత్తం కంట్రోల్ కంపెనీకి ఉంటుంది. మీరేం యాక్సెస్ చేయాలో కూడా కంపెనీనే నిర్ణయిస్తుంది. ఆయా పరిధులకు లోబడే మీ పర్సనల్ లేదా వర్క్ ప్రొఫైల్‌ని యాక్సెస్ చేయగలరు.



అందుకు కావాల్సిన పాస్‌వర్డ్స్, అకౌంట్స్‌లను కంపెనీనే సెట్ చేస్తుంది. దీంతో ఉద్యోగులు పని సమయంలో తమ వ్యక్తిగత సమాచారానికి యాక్సెస్ చేయకుండా కంట్రోల్ చేయొచ్చు. వర్క్ ప్రొఫైల్ ద్వారా, ఉద్యోగులు పని సంబంధిత సమాచారాన్ని త్వరగా యాక్సెస్ చేయగలుగుతారు. అంతేకాదు.. ఉద్యోగులు తమ పనికి సంబంధించిన నోటిఫికేషన్లు, అప్‌డేట్స్‌ను ప్రత్యేకంగా పొందొచ్చు. ఫోన్ మెయిన్ మెనూ ట్యాప్ చేయడం ద్వారా ఈ రెండు ప్రొఫైల్స్‌ను యాక్సెస్ చేయగలుగుతారు. ఒకవేళ వ్యక్తిగతంగా మీరే ఫోన్‌లో వర్క్ ప్రొఫైల్‌ని క్రియేట్ చేసుకుంటే.. కావాల్సినట్టుగా ఎప్పటికప్పుడు సెట్టింగ్స్‌లో మార్పులు చేసుకోవచ్చు. పర్సనల్ ప్రొఫైల్ కూడా మీ కంట్రోల్‌నే ఉంటుంది. వర్క్ ప్రొఫైల్‌లో ఉన్న యాప్స్ నీలి రంగు 'బ్రీఫ్ కేసు' ఐకాన్‌తో కనిపిస్తాయి. దీంతో యాప్స్ ఏయే విభాగాలకు సంబంధించినవో ఇట్టే గుర్తుపట్టొచ్చు. ఈ సదుపాయం ఆండ్రాయిడ్ 5.0, 8.0 వెర్షన్స్‌లో మాత్రమే అందుబాటులో ఉంది. ఈ ఫీచర్ ద్వారా... ఉద్యోగులు తమ పనిని మరింత సమర్థవంతంగా నిర్వహించడం మాత్రమే కాకుండా, వారి వ్యక్తిగత సమాచారాన్ని కూడా రక్షించుకోవచ్చు.



# డాడీ డ్యూటీ సూపర్బ్

**బాలీవుడ్** జంట రణ్‌వీర్ సింగ్, దీపిక పదుకొణె ఇంట ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. కూతురు దువాసింగ్ వచ్చినప్పటి నుంచి తమ ఇంట సంతోషాలు అనంతంగా కొనసాగుతున్నాయని రణ్‌వీర్ పేర్కొన్నాడు. గత సెప్టెంబర్‌లో దువాసింగ్ జన్మించింది. కూతురుతో ఫస్ట్ ట్రిప్ వెళ్లొచ్చిన ఈ జంట నూతనోత్సాహంతో కనిపిస్తున్నది. కూతురు పుట్టినప్పటి నుంచి పితృత్వపు సెలవుల్లో ఉన్న రణ్‌వీర్ దాదాపు మూడు నెలల గ్యాప్ తర్వాత షూటింగ్స్‌లో పాల్గొంటున్నాడు. ఈ సందర్భంగా తండ్రిగా తనకు కలుగుతున్న ఫీలింగ్ గురించి ఇలా చెప్పుకొచ్చాడు. 'నా చిట్టితల్లి వచ్చాక మా జీవితం ఇంత అందంగా, ఆనందంగా ఉంటుందని అస్సలు ఊహించలేదు. దువాతో గడుపుతున్న క్షణాలు నా జీవితంలోనే అత్యంత విలువైనవి. డాడీ డ్యూటీ సూపర్‌గా ఉంది. నా కూతురు కండ్లలోకి చూస్తూ రోజులకు రోజులు గడిపేస్తున్నా! మీ అందరితో విడిపోవడానికి నేను సిద్ధంగా ఉన్నాను' అంటూ తనదైన శైలిలో పుత్రికోత్సాహాన్ని పంచుకున్నాడు రణ్‌వీర్. ఇక ఇటీవల రణ్‌వీర్, దీపికా కలిసి నటించిన మల్టీస్టారర్ 'సింగం 3' బాక్సాఫీస్ దగ్గర యావరేజ్ టాక్ తెచ్చుకుంది. ప్రస్తుతం ప్రతిష్ఠాత్మక చిత్రం 'డాన్ 3' షూటింగ్ కోసం రణ్‌వీర్ సిద్ధమవుతున్నాడు. సెట్స్ మీదున్న ఈ సినిమా వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. డాన్, డాన్ 2లో షారుక్ ఖాన్ పోషించిన పాత్రలో రణ్‌వీర్ కనిపించనున్నాడు. అతనికి జోడీగా కియారా అద్వానీ నటించనుంది.

# కొబ్బరిపాలతో మృదువుగా..

**చలికాలంలో** చర్మం పొడిగా మారుతుంది. దీంతో నిగారింపు కోల్పోతుంది. ఇలాంటప్పుడు కొబ్బరి పాలతో చర్మాన్ని మృదువుగా మార్చుకోవచ్చు.

- పచ్చి కొబ్బరిని తురిమి, కొద్ది నీళ్లతో కలపాలి. లేదా కొబ్బరిని మిక్సీలో వేసి కాస్త నీళ్లు కలిపి పేస్ట్‌లా చేయాలి.
- ఈ మిశ్రమాని వడకట్టి కొబ్బరి పాలను విడిగా తీయాలి.
- ఆ పాలలో దూదిని ముంచి ముఖం, మెడలాంటి ప్రాంతాల్లో అద్దాలి.
- 20 నిమిషాలు ఉంచి చల్లటి నీళ్లతో కడిగేయాలి.

